వ్యవసాయానికి ఫుల్ పవర్

- ఉచితంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా
- రూ.6.70 కోట్లతో సబ్‌స్టేషన్ల నిర్మాణం
- ఇప్పటికే రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- సబ్ డివిజన్‌లో 66,243 విద్యుత్ కనెక్షన్లు, 14 సబ్‌స్టేషన్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు


కోగిలతోట గ్రామంలో ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

ఆలూరు రూరల్: నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌కో రూ.6.70 కోట్లతో కొత్త సబ్‌స్టేషన్లను నిర్మించింది. వేసవిలో మరింత నాణ్యతగా విద్యుత్ సరఫరా చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వీటి నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసింది. అలాగే వ్యవసాయానికి పగటిపూట 9 గంటల పాటు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందించేందుకు మరింత కృషి చేస్తోంది. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని 5 మండలాల్లో 11,114 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, 65,129 ఎల్‌టీ కనెక్షన్లు ఉన్నాయి. 14 సబ్ స్టేషన్లు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాయి. ఇటీవలే హొళగుంద మండలం కోగిలతోట వద్ద 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను రూ.4.13 కోట్లతో నిర్మించారు. అలాగే 2021లో ఆస్పరి మండలం తంగరడోణ గ్రామం వద్ద రూ.2.57 కోట్లతో 33/11 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. అలాగే ఆలూరు మండలంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో వ్యవసాయానికి నాణ్యమైన కరెంటు అందుతోంది. అలాగే సబ్ డివిజన్‌లో వ్యవసాయ, ఎల్‌టీ కనెక్షన్‌లకు లో ఓల్టేజీ సమస్య తీరింది. దీంతో రైతులు, విద్యుత్ వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లో-ఓల్టేజీ సమస్య తీరింది



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వచ్చే మూడు గంటల కరెంటు పదిసార్లు పోతుండేది. లో ఓల్టేజీతో పాటు లోడు ఎక్కువ ఉండేది. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకునే వారు కాదు. ఇటీవలే మా గ్రామం వద్ద కొత్తగా సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడంతో సంతోషంగా ఉంది. లో ఓల్టేజీ సమస్య తీరింది. సేద్యానికి కరెంటు సమస్య లేదు. పగటి పూట నిరంతరాయంగా వ్యవసాయ కరెంటు సరఫరా అవుతోంది. నాలాంటి రైతులు సంతోషంగా ఉన్నాం. – దేవన్న, కోగిలతోట గ్రామం

వ్యవసాయానికి ఇబ్బంది లేదు



ఆలూరు ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో వ్యవసాయానికి 9 గంటల కరెంటు సాఫీగా అందుతోంది. గతంలో కొన్ని ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య ఉండేది. ఇప్పుడు అదనంగా సబ్‌స్టేషన్లు నిర్మించడంతో ఆ సమస్య కూడా తీరింది. దీనికి తోడు వ్యవసాయ ఫీడర్‌లకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ.. ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేస్తున్నాం. వ్యవసాయ,గృహ,పరిశ్రమల వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేదు. – నాగేంద్ర, ట్రాన్స్‌కో డీఈఈ,ఆలూరు

క్లుప్తంగా

ఎన్నికల సమాచార కేంద్రం ప్రారంభం

ఆలూరు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆలూరు నియోజకవర్గంలో ఓటర్లకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు జిల్లా ఎన్నికల మెజిస్ట్రేట్, కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించినట్లు ఆర్‌ఓ రాము నాయక్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. ఓటర్లకు ఏమైనా సందేహాలుంటే 08523-235010 నంబర్‌కు కాల్ చేస్తే హెల్ప్ డెస్క్ సిబ్బంది సరైన సమాచారం అందిస్తారన్నారు. అలాగే మరిన్ని వివరాలకు 98499 04167 నంబర్‌కు కాల్ చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్ తెలిపారు. తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ రజనీకాంత్ రెడ్డి, ఎలక్షన్ డీటీ గుండాలనాయక్, సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడు తదితరులు ఉన్నారు.

రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం


ఉప్పర్లపల్లిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

తుగ్గలి: గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టింది. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గ్రామంలో పర్యటించగా సీసీ రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు ఆమెను కోరారు. దీంతో మండల పరిధిలోని ఉప్పర్లపల్లి, మీటేతండా, సూర్యతండాల్లో గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలు వెచ్చించి సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. సీసీ రోడ్ల నిర్మాణాలతో ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యతల స్వీకరణ


నందవరం డీటీ అబ్దుల్‌వహీద్

నందవరం: నందవరం మండల డిప్యూటీ తహసీల్దార్‌గా అబ్దుల్ వహీద్ బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఆయన కర్నూలు కలెక్టర్ కార్యాలయం నుంచి సాధారణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ రాఘువీర ఎమ్మిగనూరు ఎన్నికల డీటీగా బదిలీపై వెళ్లారు. బుధవారం డీటీ అబ్దుల్‌వహీద్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు.

చిన్నారులపై వీధి కుక్కల దాడి


గాయపడ్డ లోకేష్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం వీధి కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ముగతి పేటకు చెందిన రుతిక్ (8) ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి కరవడంతో గాయాలయ్యాయి. అలాగే సోమేశ్వర సర్కిల్ బొడ్రాయి సమీపంలో లోకేష్ (5) ఇంటి ముందు ఉండగా కుక్క దాడిచేయడంతో చేతికి గాయమైంది. గాయపడ్డ చిన్నారులను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు చికిత్స చేసి ఇంటికి పంపారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని మున్సిపల్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

కోతుల బెడదతో బెంబేలు


గాయపడిన వృద్ధురాలు

దేవనకొండ: మండలకేంద్రంలో కోతుల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. స్థానిక మంగలి వీధికి చెందిన రంగమ్మ అనే వృద్ధురాలిపై బుధవారం కోతులు దాడులు చేసి తలపై కొరికాయి. దీంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. స్థానికులు వెంటనే దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అక్కడినుంచి కర్నూలుకు రెఫర్ చేయగా జిల్లా కేంద్రంలో వైద్య చికిత్సలు చేయించుకుని రాత్రి ఇంటికి చేరుకున్నారు. కోతుల బెడదపై ఎన్నిసార్లు పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిత్యం ఎవరో ఒకరు కోతులబారి నుంచి గాయపడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని కోతుల బారి నుంచి ప్రజలను రక్షించాలని కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

చిప్పగిరి: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు గుమ్మనూరు, నంచర్ల గ్రామాల పంచాయతీ కార్యదర్శి సురేంద్ర తెలిపారు. ఆయన బుధవారం గుమ్మనూరు గ్రామ సచివాలయంలో మాట్లాడుతూ.. గ్రామంలో మూడు బోర్లు వేశామని, వాటిలో నీరు పుష్కలంగా ఉందన్నారు. వేసవిలో ఎలాంటి సమస్య తలెత్తినా మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఇంటి పన్నులు, కొళాయి పన్నులు వసూలు ప్రక్రియ వేగవంతం చేశామని, ఈ నెలాఖరు కల్లా మొత్తం వసూలు చేస్తామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యం, బైక్‌తో సెబ్ సీఐ భార్గవ రెడ్డి

హొళగుంద: మండల పరిధిలోని హెబ్బటం గ్రామ శివారులోని కురుకుంద రోడ్డులో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తున్న నెరణికి తండా గ్రామానికి చెందిన టాక్రియా నాయక్, పరమేష్, దుర్గానాయక్‌లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ముగ్గురు నిందితులు కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప తాలూకా రారావి నుంచి నెరణికి తండాకు మోటార్ సైకిళ్లపై తీసుకొస్తున్న 8 బాక్సుల్లోని 768 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితులను రిమాండ్‌కు పంపి రెండు బైక్‌లను సీజ్ చేశామన్నారు.

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యం, బైక్‌ను మీడియాకు చూయించారు. ఆయన మాట్లాడుతూ.. తమ సిబ్బందితో కలిసి బుధవారం మంత్రాలయం మండలం కగ్గల్లు క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా బైక్‌పై వచ్చిన వ్యక్తి పోలీసులను చూసి బైక్, మద్యం వదలి పారారైనట్లు చెప్పారు. ఏపీ 21 ఏఎల్ 5950 నంబర్ గల పల్సర్ బైక్‌తో పాటు 6 బాక్సుల్లోని 576 (90 ఎంఎల్) ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు కోసిగి మండలం దొడ్డిబెళగల్‌కు చెందిన నాగార్జునగా గుర్తించామని త్వరలో పట్టుకుంటామన్నారు. తనిఖీల్లో సెబ్ ఎస్‌ఐ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు లింగప్రసాద్, నరసింహారెడ్డి, భరత్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పూర్తి చేయాలి

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో జెడ్పీ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులను సకాలంలో పనులు పూర్తి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున అన్నారు. బుధవారం గ్రామంలో చేపట్టిన పనులను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. మురుగు కాలువ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయం వద్ద నుంచి పోతుండడంతో దుర్వాసనతో ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడేవారని డ్రైనేజీ నిర్మించడం వల్ల సమస్య తీరుతుందన్నారు. వెంటనే పూర్తి చేసి ఉపయోగంలోకి తెస్తామన్నారు.

రేషన్ డీలర్లు ప్రచారంలో పాల్గొనరాదు

మద్దికెర: చౌక దుకాణాల డీలర్లు రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో, ప్రచారంలో పాల్గొంటే ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తప్పవని తహసీల్దార్ రజాక్‌వలి హెచ్చరించారు. ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు రాజకీయ నాయకులతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారని ఫిర్యాదులు అందితే విచారణ చేసి విధుల నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. స్టోర్లలో నాయకుల ఫొటోలు ఉంటే తొలగించాలని సూచించారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ బియ్యం పోషక విలువలు కలిగినవని ప్రతి ఒక్కరూ నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఈ బియ్యం వల్ల మహిళలు రక్తహీనత బారిన పడకుండా ఉంటారన్నారు. ఆర్‌ఐ రవి కుమార్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో సర్పంచ్ బైటిగేరి శివన్న, ఎంపీటీసీ విజయమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టారు. గ్రామంలో వారం రోజులుగా బోరు, పైపులైన్ మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం బోరుకు మరమ్మతులు చేయించి, పైపులైన్ ఏర్పాటు చేసి గ్రామంలో నీటిని సరఫరా చేశారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

చిప్పగిరి: బెల్డోణ సహకార సంఘంలో వివిధ రుణాలు పొందిన వారు సకాలంలో వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలని బెల్డోణ సొసైటి సెక్రటరీ హరికృష్ణ సూచించారు. ఆయన బుధవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో మాట్లాడుతూ.. సొసైటీలో మొత్తం 2,400 మంది సభ్యులు ఉన్నారని వారిలో 998 మంది రైతులు వివిధ రుణాలు పొందారన్నారు. పంట రుణాలు, దీర్ఘకాలిక, రైతు నేస్తం, రాజన్న చేయూత, మొదలగు రుణాలు ఉన్నాయని చెప్పారు. పంట రుణాలు పొందినవారు ఈ నెల 31వ తేదీలోపు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. సొసైటీ ద్వారా మొత్తం రూ.24 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి


సిద్ధం కిట్లను పంపిణీ చేస్తున్న యూత్ అధ్యక్షుడు బందెనవాజ్

గోనెగండ్ల: గత ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పాలనను చూసి మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఆ పార్టీ యూత్ అధ్యక్షుడు బందెనవాజ్ కోరారు. బుధవారం గోనెగండ్లలో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో భాగంగా బూత్ కమిటీ సభ్యులకు సిద్ధం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అతినీతికి తావు లేకుండా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు. సంక్షేమ రథసారథికి మరోసారి మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అలాగే బూత్ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించి ఓటర్లను అభ్యర్థించాలన్నారు. టీడీపీని నమ్మి మరోసారి మోసపోవద్దని ఓటర్లకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దొరబాబు, నాయుడు, ఉస్మాన్, ఖాజా పటేల్, రఘు, పద్మనాభం, నదిమూల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ దేవర


కనకవీడులో అమ్మవారికి భోనాలు సమర్పిస్తున్న భక్తులు

నందవరం: మండల పరిధిలోని కనకవీడులో గ్రామ దేవర మారెమ్మ దేవర ఘనంగా జరిగింది. డప్పు దరువులు, మేళతాళాల మధ్య పురవీధుల్లో బారులు తీరిన భక్తుల మధ్య కుంభోత్సవం కనువిందు చేసింది. వేకుజామున గ్రామ దేవతకు విశిష్ట పూజలు చేపట్టారు. సంప్రదాయంలో భాగంగా అమ్మవారికి భోనాలు, నైవేద్య సమర్పణ గావించారు. బలిదానాలు కానిచ్చి ఉదయం కుంభోత్సవాలు నిర్వహించారు. డప్పు దరువులతో అమ్మవారికి భక్తులు భోనాలు సమర్పించారు. ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరించి పిండి వంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మారెమ్మవ్వను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, సర్పంచ్ మద్దీశ్వరి, వైస్ ఎంపీపీ నడిపి షేక్‌సాహెబ్, ఎంపీటీసీ సుశీలమ్మ దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి పనులు కల్పించండి

ఆలూరు: క్లస్టర్ పరిధిలో వ్యవసాయ కూలీలు, కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ పద్మావతి ఆదేశించారు. స్థానిక సీఎల్‌ఆర్సీ కార్యాలయంలో బుధవారం ఏపీఓ శ్రీనివాసులు సమక్షంలో క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న ఏపీఓ, ఈసీ, టీసీ, ఎఫ్‌ఏలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీడీ పద్మావతి మాట్లాడుతూ.. గ్రామాల్లో పనులు కావాలని అడిగిన వారందరికీ జాబ్ కార్డులను మంజూరు చేసి ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోరుబావులు, నీటి వసతి కలిగిన రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి సారించేలా కృషి చేయాలన్నారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కడుపుబ్బా నవ్వించిన కామన్న వేడుకలు


విచిత్ర వేషధారణలో యువకులు

హొళగుంద: మండల కేంద్రంలో విరక్త మఠం పరిసర ప్రాంతాలకు చెందిన యువకుల ఆధ్వర్యంలో జరుగుతున్న కామన్న వేడుకల్లో భాగంగా బుధవారం యువకులు వేసిన వేషాలు ప్రజలను అమితంగా ఆకట్టుకున్నాయి. అనేక రకాల హాస్య సన్నివేశాలను ప్రదర్శిస్తూ కుట్టిదరే కుట్టమ్మ, ఇల్లిబా సంగయ్య, కూతురి కాన్పుకష్టాలు, సన్యాసులు, వరుడి అన్వేషణ, శోభనం, కామన్న భార్యల కష్టాలు, కామన్న దహనం ఇలా పలు హాస్య సన్నివేశాలను ప్రదర్శిస్తున్నారు. ఆఖరి రోజు రాక్షసుల దహనం ఇతర నాటకాలు, సన్నివేశాలతో ముగింపు ఉంటుందని విరక్త మఠం యువకులు తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో డీఈఓ తనిఖీ


హొళగుంద పరీక్షా కేంద్రం వద్ద డీఈఓ శామ్యూల్

హొళగుంద: మండలంలో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం డీఈఓ శామ్యూల్ ఆకస్మిక తనిఖీ చేశారు. గదులన్నీ కలియతిరిగి విద్యార్థులు కాపీ చీటీలు, మాస్ కాపీయింగ్ పాల్పడుతున్నారా అని పరిశీలించారు. విద్యార్థులు రాసిన అన్సర్ షీట్‌లను పరిశీలించారు. ఎవరైనా చూచి రాతకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే కేంద్రాలలో తాగునీరు, వైద్యసేవలు, ఇతర సదుపాయాల గురించి పరీక్షా కేందాల్ర చీఫ్‌లు కబీర్‌సాబ్, రమణయ్య, మల్లికార్జునగౌడ్‌లను అడిగి తెలుసుకున్నారు. మొత్తం మూడు కేంద్రాల్లో 536 మందికి గాను 21 మంది పరీక్షకు గైరాజరైనట్లు డీఈఓ శామ్యూల్ తెలిపారు.

బీసీలకు ప్రాధాన్యతనిచ్చింది వైఎస్సార్‌సీపీనే


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ నజీర్‌అహమ్మద్

ఎమ్మిగనూరుటౌన్: బీసీలకు అధిక ప్రాధాన్యతనిచ్చి వారికి రాజకీయంగా అందలం ఎక్కించిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పేర్కొన్నారు. వారు బుధవారం స్థానిక శిల్పా ఎస్టేట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బుట్టా రేణుకను ప్రకటించిన నాటి నుంచి టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. బీసీ మహిళా అభ్యర్థిపై టీడీపీ నాయకులు అనవసర ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. స్థానిక బీసీ శ్మశాన వాటిక భూమి ఆక్రమణకు గురికాకుండా విస్తీర్ణం కొలిపించి హద్దులు ఏర్పాటు చేయాలని కొందరు కులసంఘాల వారు కోరడంతో ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని ఆదేశించగా సర్వేయర్‌తో కొలతలు వేయించారన్నారు. హద్దు రాళ్లు పాతించడంతో నాడు కులసంఘాల వారు ఎమ్మెల్యేకు, కమిషనర్‌కు ధన్యావాదాలు సైతం తెలిపారన్నారు. ప్రస్తుతం టీడీపీ వారు దాన్ని రాజకీయం చేసి లబ్ధిపొందాలని చూస్తున్నారని, పరిష్కారమైన సమస్యను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకకు ఆపాదిస్తూ పబ్బం గడుపుకోవాలని చూడడం అవివేకమన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారన్నారు. అలాగే పట్టణంలో వాల్మీకులకు ఇచ్చిన స్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారన్నారు. సీఎం జగనన్న సూచనతో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తన ఎమ్మెల్యే సీటును బీసీలకు త్యాగం చేసి బుట్టారేణుకకు మద్దతు ఇచ్చారని, టీడీపీలో బీసీలకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే దమ్ము, ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు. వైఎస్ఆర్‌సీపీ పట్టణ కార్యదర్శి యుకె వీరేంద్ర, బుట్టా నాగరాజు, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు ఎంకె శివప్రసాద్, వెంకటాపురం బజారి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గోనెగండ్ల: మండలంలోని పెద్దమరివీడు, చిన్నమరివీడు, అలువాల, పెద్దనేలటూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎంపీడీఓ సోనీబాయి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉండవలసిన సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో ఉండవలసిన ర్యాంప్, తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్ తదితర సదుపాయాలు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. ఆయా గ్రామాలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామ పోలింగ్ బూత్‌లను బుధవారం తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ శివశంకరప్ప పరిశీలించారు. వసతులు, సౌకర్యాలు పరిశీలించారు. గ్రామంలోని సచివాలయాలను తనిఖీ చేసి సిబ్బంది హాజరును పరిశీలించారు. మల్లెపల్లె గ్రామాన్ని సందర్శించి ఎన్నికల కోడ్ నేపథ్యంలో నూతన అభివృద్ధి పనులకు అనుమతులు ఉండవని, కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


హొళగుంద వీధుల్లో కవాతు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్ బలగాలు

హొళగుంద: గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, హొళగుంద ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు హెచ్చరించారు. బుధవారం సీఐ ఆధ్వర్యంలో హొళగుంద, కోగిలతోట, ఎల్లార్తి గ్రామాలలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బలగాలతో సమస్యాత్మక గ్రామాలలో పర్యటించి ఎలాంటి గొడవలు జరగకుండా ప్రజలకు రక్షణగా ఉన్నామని ధైర్యం కల్పించేందుకు ఈ కవాతు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. అలాగే ఆయా గ్రామాలలో ప్రజలతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంతా జీవించేందుకు పోలీసులు అండగా ఉంటారన్నారు. గొడవలు, బెదిరింపులకు దిగడం ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్రమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

నిషేధిత సామగ్రి తరలిస్తే కఠిన చర్యలు


కారు డిక్కీలో తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాసులు

దేవనకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా అక్రమంగా మద్యం, నిషేధిత సామగ్రి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని గద్దెరాళ్ల క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి డబ్బు తీసుకెళ్లరాదని, అక్రమంగా నాటుసారా, కర్ణాటక మద్యం తరలించినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడే వ్యవహరించాలన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ అనుసంధానం చేయించండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు

నందవరం: ఉపాధి కూలీల బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి ఆధార్ కార్డును అనుసంధానం చేయించాలని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, ఏపీఓ శ్రీనివాసులు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులకు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నియమావళికి అనుగుణంగా పనిచేయాలన్నారు. నియమ నిబంధనలు పాటించాలన్నారు. హార్టికల్చర్‌లో భాగంగా ఫారంపాండ్ పనులను గుర్తించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. అడిగిన వారందరికీ పనులు కల్పించాలని సూచించారు. ఆధార్ అనుసంధానం, బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ పూర్తయితేనే ఉపాధి కూలీల బ్యాంక్ ఖాతాలకు కూలీల నగదు జమ అవుతుందని వివరించారు. ఈసీ నూర్జహాన్, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంగ్లిష్ పరీక్ష

మద్దికెర: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని చీఫ్‌లు జాకీర్ హుస్సేన్, మోహన్ తెలిపారు. మండలంలో ఏర్పాటుచేసిన రెండు పరీక్షా కేంద్రాలలో 8 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. జడ్పీ బాలుర పాఠశాలలో 183 మందికి గాను 180 మంది, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 192 మందికి గాను 187 మంది పరీక్ష రాసినట్లు వెల్లడించారు.

18 మంది గైర్హాజరు

తుగ్గలి: మండలంలో పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తుగ్గలిలో 2, పెండేకల్లు రైల్వే జంక్షన్, జొన్నగిరిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు రెగ్యులర్, ప్రవేటు విద్యార్థులు 655 మందికి గాను 637 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఫ్లెక్సీల తొలగింపు

ఆస్పరి: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తహసీల్దార్ ఈరమ్మ ఆదేశాలతో మేజర్ గ్రామ పంచాయతీ ఆస్పరిలో రెండు రోజులుగా వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది తొలగించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్, బస్టాండ్‌లో ఫ్లెక్సీలను తొలగించి ట్రాక్టర్‌లో తరలించారు. ఎవరూనా ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయని తహసీల్దార్ హెచ్చరించారు.